క్లుప్తంగా

భారీగా తగ్గిన చికెన్ ధరలు

ఖిలా వరంగల్ : జిల్లాతో పాటు నగరంలో చికెన్ ధరలు మరోసారి తగ్గాయి. కార్తీక మాసం కావటంతో చికెన్‌కు పూర్తిగా డిమాండ్ తగ్గి ఒక్కసారిగా ధరలు పడిపోయాయి. వారం క్రితం వరకు స్కిన్‌లెస్ చికెన్ కిలో ధర రూ.180 నుంచి 170 వరకు విక్రయించగా బుధవారం రూ.160 ఉండగా స్కిన్‌తో రూ.140 ధర పలికింది. నాటుకోడి ధరలు తగ్గుముఖం పట్టలేదు. ప్రస్తుతం నాటుకోడి లైవ్ కిలో రూ.400లు ధర పలుకుతోంది. ఈ ఏడాది చికెన్ ధర ఇంత కనిష్టానికి చేరటం ఇదే తొలిసారి అంటూ వ్యాపారులు చెబుతున్నారు. కార్తీకమాసం ముగిసే వరకు ఈ ధరలు ఇంకా తగ్గే అవకాశాలు ఉన్నాయని పలువురు చెబుతున్నారు.

10న సీపీస్టార్-23 టాలెంట్ టెస్ట్

కాజీపేట అర్బన్ : నీట్, ఐఐటీలో ఉచిత శిక్షణ, స్కాలర్‌షిప్‌లను అందజేసేందుకు కెరీర్ పాయింట్ కోటా రాజస్థాన్ ఈనెల 10న సీపీ స్టార్-23 టాలెంట్ టెస్ట్‌ను పదో తరగతి విద్యార్థులకు నిర్వహించనున్నట్లు వరంగల్ బ్రాంచ్ చైర్మన్ జూలపల్లి కర్ణాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యూశాయంపేటలోని కెరీర్ పాయింట్‌లో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 నిమిషాల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిభ కనబరిచిన ఐదుగురు విద్యార్థులకు ఉచిత శిక్షణ అందజేయనున్నట్లు తెలిపారు. వివరాలకు ఆన్‌లైన్‌లో www.careerpoint warangal.com లేదా 8988111189 నెంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత



హసన్‌పర్తి: ఆధ్యాత్మిక చింతన ద్వారానే మానసిక ప్రశాంతత చేకూరుతోందని బీఆర్‌ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ అన్నారు. 65వ డివిజన్ దేవన్నపేటలో వెన్నపురెడ్డి సంతోష్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అయ్యప్ప పడిపూజ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు , కార్యకర్తలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డికి ఆర్టిస్టుల శుభాకాంక్షలు

హన్మకొండ: తెలంగాణ సీఎంగా పదవీ బాధ్యతలు చేపట్టనున్న రేవంత్‌రెడ్డికి ఏకశిల క్రియేటివ్ ఆర్టిస్టుల అసోసియేషన్ పక్షాన శుభాకాంక్షలు తెలిపారు. హనుమకొండలోని లష్కర్ బజార్‌లోని స్ట్రీట్‌వెండర్స్ కాంప్లెక్స్‌లో బుధవారం కార్యవర్గ సమావేశంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బొజ్జపల్లి రాజయ్య మాట్లాడుతూ చిత్రకారుడిగా ప్రస్థానం ప్రారంభించి, జర్నలిస్టుగా ప్రయాణాన్ని సాగించి సీఎంగా ఎదగడంపై ఆర్టిస్టులుగా సంతోష పడుతున్నామని అన్నారు. కార్యక్రమంలో చంద్రారెడ్డి, భిక్షపతి, ప్రేమ్, రాజు, పోతుల రమేష్, గద్ద నిరంజన్, సంజీవ్, రాము, వాసు, శంకర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ అభినందనలు

కాశిబుగ్గ : రేవంత్‌రెడ్డికి తెలంగాణ స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ తెలంగాణ(ఎస్‌జీపీటీ) వరంగల్ జిల్లా అధ్యక్షుడు కర్రు సుధీర్‌బాబు, ప్రధాన కార్యదర్శి సదానందం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా పెన్షర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని వారు కోరారు.

'నాయిని'కి కేబినెట్‌లో అవకాశం కల్పించాలి



నయీంనగర్: వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి కేబినెట్‌లో అవకాశం కల్పించాలని హనుమకొండ జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు అలువాల కార్తీక్ విజ్ఞప్తి చేశారు.బుధవారం హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో కార్తీక్ మాట్లాడుతూ ఇతర పార్టీల నాయకులు ఎన్ని అవకాశాలు ఇచ్చినా ప్రలోభాలకు లొంగకుండా పార్టీని, కార్యకర్తలను పట్టుకొని పార్టీ కోసం పనిచేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు వినయ్‌కుమార్, అరుణ్ రెడ్డి, సెహ్వాగ్, సునీల్ నాయక్, రాకెష్, మనితేజ పాల్గొన్నారు.

హన్మకొండ అర్బన్ : వరంగల్ పశ్చిమ నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యే గెలుపొందిన సీనియర్ నాయకుడు నాయిని రాజేందర్‌రెడ్డికి కేబినెట్ హోదా కల్పించాలని 49వ డివిజన్ అధ్యక్షుడు నాగపురి దయాకర్ కాంగ్రెస్ పెద్దలకు విన్నవించారు. 35 ఏళ్లుగా ఒకే పార్టీ ఒకే జెండా అనే ఆలోచనతో హనుమకొండ జిల్లా ప్రజలకు మమేకమై కార్యకర్తలను తయారు చేసి, బలహీన వర్గాలకు వెన్నుదన్నుగా నిలిచి ప్రోత్సహించే నాయినికి క్యాబినెట్ హోదా కల్పించాలని పేర్కొన్నారు.

హన్మకొండ అర్బన్ : వడ్డేపల్లిలో..



మామునూరు : ఆర్టీఏ జంక్షన్‌లో ..



హసన్‌పర్తిలో...



మడికొండ : అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న కాజీపేట ఏసీపీ డేవిడ్‌రాజ్



సంస్కరణలకు ఆద్యుడు బీఆర్ అంబేడ్కర్

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సంస్కరణలకు ఆద్యుడని పలు పార్టీల నాయకులు, పులువురు ముఖ్యనేతలు కొనియాడారు. బుధవారం నగరంలోని పలు కాలనీల్లో, ప్రధాన కూడళ్లలో అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అంబేడ్కర్ బడుగు, బలహీనవర్గాల, దళితుల సంక్షేమం కోసం పోరాడిన యోధుడని అన్నారు. అంబేడ్కర్ స్ఫూర్తిని కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అణగారిన వర్గాలకు అండగా నిలిచిన మహోన్నత వ్యక్తి పేర్కొన్నారు. కార్యక్రమాల్లో అన్ని పార్టీల నాయకులు, అంబేడ్కర్ సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు, ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



వరంగల్ లీగల్ : అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న న్యాయవాదులు



కాశిబుగ్గలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వెంకటరమణ



న్యూశాయంపేట : అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



కాజీపేట అర్బన్ : నివాళులర్పిస్తున్న నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ



హన్మకొండ : అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వినయ్‌భాస్కర్



కాజీపేట : డీజిల్‌షెడ్‌లో పాల్గొన్న రైల్వే సీనియర్ డీఎంఈ స్వరాజ్‌కుమార్



వరంగల్ చౌరస్తా: వరంగల్ 27వ డివిజన్‌లో చిత్రపటానికి పూలమాలవేస్తున్న నాయకులు



కేయూ క్యాంపస్ : కేయూ పరిపాలనా భవనంలో మాట్లాడుతున్న వీసీ రమేష్



ఖిలావరంగల్ : అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి

ప్రమాదకరంగా గుంత



హసన్‌పర్తి: 66వ డివిజన్ హసన్‌పర్తిలోని వేంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో ప్రధానరోడ్డు మధ్య ఉన్న గుంత ప్రమాదకరంగా ఉంది. ఏడాది క్రితం గేట్ వాల్వ్ నిర్మించడానికి రోడ్డును తవ్వారు. వాల్వ్ ఏర్పాటు తర్వాత అలాగే వదిలిపెట్టారు. దీంతో వాహనచోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో ఇక్కడ ప్రమాదాలు జరిగి ఆస్పత్రి పాలవుతున్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

బాధిత కుటుంబానికి పరామర్శ



వరంగల్: గ్రేటర్ వరంగల్ 3వ డివిజన్ కొత్తపేటకు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త ఈసంపెల్లి ఐలయ్య ఇంటిని గుర్తుతెలియని దుండగులు దహనం చేయడంతో బాధిత కుటుంబాన్ని ఆ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ బుధవారం పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఈ ఘటనకు కారకులైన వారిని వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ కుటుంబ సభ్యులకు ఎల్లవేళలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు.ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

గొప్ప గులాబీ సైనికున్ని కోల్పోయాం

- పార్టీని బలోపేతం చేస్తూ ముందుకు నడిపిన నాయకుడు సంపత్‌రెడ్డి
- బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్

హన్మకొండ: బీఆర్‌ఎస్ జనగామ జిల్లా అధ్యక్షుడు, జనగామ జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి మృతితో గొప్ప గులాబీ సైనికున్ని కోల్పోయామని బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో సంపత్‌రెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా సంపత్‌రెడ్డి చిత్రపటానికి వినయ్‌భాస్కర్, హనుమకొండ జెడ్పీ చైర్మన్ మారపల్లి సుధీర్ కుమార్, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో కీలక భూమిక పోషించడంతో పాటు బీఆర్‌ఎస్ పార్టీని బలోపేతం చేస్తూ ముందుకు నడిపిన నాయకుడు సంపత్‌రెడ్డి అని అన్నారు. కార్యకర్తలను కాపాడుకుంటూ జనగాం జిల్లాలో పార్టీ పటిష్టతకు పాటుపడ్డారన్నారు. వారి కుటుంబానికి బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్ రాజు యాదవ్, టీజీపీ రాష్ట్ర అధ్యక్షుడు మర్రి యాదవరెడ్డి, బీఆర్‌ఎస్ వరంగల్ పశ్చిమ నియోజకవర్గం కోఆర్డినేటర్ జనార్దన్ గౌడ్, నాయకులు పులి రజనీకాంత్, వీరేందర్, సిరాజుద్దీన్, నయిముద్దీన్, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.



సంపత్‌రెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వినయ్‌భాస్కర్, సుధీర్‌కుమార్

వేలాడుతున్న విద్యుత్ తీగలు

- పట్టించుకోని అధికారులు
- భయాందోళనలో ప్రజలు

హసన్‌పర్తి: మండలంలోని పెంబర్తి శివారులో ఓ విద్యుత్ స్తంభం దెబ్బతింది. దీంతో విద్యుత్ తీగలు కిందికి వేలాడుతున్నాయి. ఏడాది కాలంగా ఈ సమస్య ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పెంబర్తిలోని వ్యవసాయ బావుల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభం గతేడాది గాలి దుమారానికి దెబ్బతిన్నది. స్తంభం మధ్యలో విరిగిపోవడం వల్ల పక్కన ఉన్న తాటి చెట్టుకు ఒరిగింది. దీంతో ఆ లైన్ గుండా వెళ్లే విద్యుత్ తీగలు కిందికి వేలాడుతున్నాయి.

అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం

కాగా, విద్యుత్ స్తంభం దెబ్బతిని తీగలు కిందికి వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. ఆ మార్గం గుండా వెళ్లే పాఠశాల వాహనాలకు విద్యుత్ తీగల ముంపు నెలకొని ఉందని స్థానికులు తెలిపారు. ఈ విషయమై రైతులు లిఖితపూర్వకంగా అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ స్పందన లేదని రైతులు వాపోతున్నారు. దెబ్బతిన్న విద్యుత్ స్తంభాన్ని మార్చాలని స్థానిక రైతులు కోరుతున్నారు.



కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలు

పాఠశాలను సందర్శించిన ఆర్జేడీ

హసన్‌పర్తి : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆర్జేడీ సత్యనారాయణ సందర్శించారు. ఈ సందర్భంగా తొలిమెట్టులో భాగంగా జరుగుతున్న కార్యక్రమాలను పరిశీలించారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. పాఠాలు, చదువు తీరును పరిశీలించారు. పాఠాలు చదివిస్తూ సమాధానాలు రాబట్టారు. ఉపాధ్యాయుల హాజరుపట్టికను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠ్యపుస్తకాల ఆధారంగా సరైన బోధన సామాగ్రిని ఉపయోగించుకుని విద్యార్థుల ద్వారా అభ్యసన ఫలితాలు సాధించాలన్నారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు సుదర్శన్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.



విద్యార్థి చదువును తీరును పరిశీలిస్తున్నఆర్జేడీ

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

హసన్‌పర్తి: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఏసీపీ విజయ్‌కుమార్ సూచించారు. నగరంలోని ఎస్‌వీఎస్ కళాశాలలో సైబర్ క్రైమ్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్‌క్రైమ్, కేయూసీ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఈ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ విజయ్‌కుమార్ మాట్లాడుతూ మొబైల్‌లో వచ్చే లింక్‌లను క్లిక్ చేయొద్దన్నారు. ఫోన్‌లో వచ్చే ఓటీపీలపై అప్రమత్తంగా ఉండడమే కాకుండా వాటిని ఎవరికి చెప్పొద్దని సూచించారు. సైబర్‌క్రైమ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, కేయూసీ ఎస్సై రాజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏసీపీ విజయ్‌కుమార్

ఢిల్లీలో రేవంత్‌రెడ్డికి అభినందనలు



వరంగల్ : టీపీసీసీ అధ్యక్షులు, తెలంగాణ నూతన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఢిల్లీలో పీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన రేవంత్‌రెడ్డిని శాలువాతో సన్మానించారు. అభినందనలు తెలిపిన వారిలో మారినేని వెంకటేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు.

'దళిత ఎమ్మెల్యేను శాసనసభా పక్ష నేతగా ప్రకటించాలి'

హన్మకొండ: దళితుడిని సీఎం చేస్తానని మాట తప్పిన కేసీఆర్ దళిత ఎమ్మెల్యేను బీఆర్‌ఎస్ శాసన సభపక్ష నేతగా ఎంపిక చేసి రాజశ్యామల దేవికి ప్రాయశ్చిత్తంగా పరిహారం చేసుకోవాలని శ్రీ రాజశ్యామలాదేవి, శ్రీ మహా వారాహీ దేవీ సేవా సమితి చైర్మన్ తిరువరంగం ప్రభాకర్ సూచించారు. రెండోసారి కేసీఆర్‌ను పరీక్షించాలని అవకాశం కల్పిస్తే బడుగు, బలహీన, దళిత, గిరిజన ప్రజలను వంచించారని, దీన్ని గమనించిన శ్రీ రాజశ్యామల దేవి తల నరుక్కోరని గ్రహించి భవిష్యత్‌లో తలదించుకుని బ్రతికేలా శపించిన ఫలితమే ఈ ఓట మికి కారణమని తెలిపారు. తిరిగి రాజశ్యామలా దేవీ అనుగ్రహం పొందాలంటే దళిత ఎమ్మెల్యేను శాసన సభపక్ష నేతగా ఎన్నుకోవాలని సూచించారు.

హోంగార్డుల సమస్యల పరిష్కారానికి కృషి



హోంగార్డ్స్ ఆవిర్భావ వేడుకుల్లో హోంగార్డ్స్, కమాండెంట్ శివప్రసాద్‌రెడ్డి

మామునూరు : బెటాలియన్‌లో విధులు నిర్వహిస్తున్న ప్రతి హోంగార్డ్ అంకితభావం, నిబద్ధతతో పనిచేస్తున్నారని, హోంగార్డ్స్‌కు ఏమైనా సమస్యలు ఉంటే సత్వర పరిష్కారానికి కృషి చేస్తానని 4, 5 టీఎస్‌ఎస్పీ బెటాలియన్ల కమాండెంట్ శివప్రసాద్‌రెడ్డి కమాండెంట్ హామీ ఇచ్చారు. ఖిలావరంగల్ మండలం మామునూరు టీఎస్‌ఎస్పీ నాలుగో బెటాలియన్‌లో పరిపాలన విభాగం అధికారుల ఆధ్వర్యంలో బుధవారం హోంగార్డ్స్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కమాండెంట్ హాజరై హోంగార్డ్స్‌ను సన్మానించారు. ఏసీ జయరాం, రాంబాబు, ఆర్‌ఐ శోభన్, రమేష్, వెంకటేశ్వర్లు, దయాశీల, పురుషోత్తంరెడ్డి, రాజ్‌కుమార్, అశోక్ పాల్గొన్నారు

దుర్గంధ భరితంగా కూరగాయల మార్కెట్

వరంగల్: వరంగల్ లక్ష్మీపురంలోని మోడల్ కూరగాయల మార్కెట్ పరిసరాలు మొత్తం బురదమయంగా తయారై దుర్గంధభరితంగా తయారైంది. రెండు రోజులుగా తేలికపాటి చినుకులు పడడంతో మార్కెట్‌తో పాటు చుట్టూ ఉన్న రహదారులపై ఉన్న మట్టి మొత్తం బురదమయంగా మారింది. నిత్యం పారిశుద్ధ్య పనులు సరిగా నిర్వహించకపోవడం వల్ల ఎక్కడి మట్టి అక్కడే ఉండడంతో వర్షం పడి ఇలా తయారైందని వ్యాపారులు తెలిపారు. మార్కెట్‌కు కొనుగోలుదారులు వెళ్లి సరుకుల కోసం వెళ్లాలంటే ఆ ఆవరణను చూసి భయపడుతున్నారు. చుట్టూ ఉన్న రహదారులపై ఉన్న బురదను తొలగించి దుర్వాసన బారి నుంచి రక్షించాలని మార్కెట్ వ్యాపారులు, వినియోగదారులు మార్కెట్ అధికారులను కోరుతున్నారు.



బురదమయంగా మార్కెట్‌లోని రహదారి

కలెక్టర్‌కు టీఎన్జీఓస్ నేతల అభినందనలు




కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీఎన్జీఓస్ నాయకులు

హన్మకొండ అర్బన్ : జిల్లాలో శాసనసభ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా అధికారుల, సిబ్బందిని సమన్వయం చేస్తూ విజయవంతంగా నిర్వహించినందుకు టీఎన్జీఓస్ అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో నాయకులు బుధవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. టీఎన్జీఓస్ జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి పనికెల రాజేష్, నాయకులు ఉన్నారు.

వరంగల్ చౌరస్తాలో సంబురాలు

వరంగల్ చౌరస్తా : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం, సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకరోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం వరంగల్ చౌరస్తాలో స్వీట్లు పంపిణీ చేసి బాణాసంచాలు కాల్చారు. మాజీ మేయర్ గుండా ప్రకాశ్ ఆధ్వర్యంలో సంబురాలు జరుపుకున్నారు. వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ విజయం సాధించగా మంత్రి పదవి రా వాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మహమ్మద్ సాధిక్, ముజాహిద్ ఖాన్, అబ్దుల్లా, ప్రభు, రాందేవ్, తదితరులు పాల్గొన్నారు.



స్వీట్లు పంపిణీ చేస్తున్న మాజీ మేయర్ ప్రకాశ్‌రావు